# జనరల్ స్టడీస్

## ఇండియన్ ఎకానమీ

## ఆర్థిక - మానవాభివృద్ధి

**ఆర్థికాభివృద్ధి ఒక సంక్లిష్ట ప్రక్రియ. ఇది సహజ వనరులు, ఆర్థిక, ఆర్థికేతర అంశాల వల్ల ప్రభావితమవుతుంది. ఆర్థికాభివృద్ధిలో సహజవనరుల పాత్ర అత్యంత ప్రధానమైంది. దీన్నే మరో విధంగా చెప్పాలంటే ఆర్థికాభివృద్ధిని సహజవనరులు నిర్ణయిస్తాయి. ఆర్థిక కారకాలు, ఆర్థికేతర కారకాలు మొదలైనవి ఆర్థికాభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకుందాం..**

ఆర్థిక కారకాల్లో ముఖ్యంగా మూలధన సదుపాయం, దాని రేటు, ఉపాంత ఉత్పత్తి, నిష్పత్తి మొదలైన అంశాలు ఒక దేశ అభివృద్ధిని నిర్ణయిస్తాయి. వీటితోపాటు వ్యవసాయ ఉత్పత్తుల మిగులు, అంతర్జాతీయ వ్యాపారంలో మిగులు కూడా ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేసే అంశాలుగా పేర్కొనవచ్చు. ఆర్థికేతర అంశాల్లో మానవ వనరుల నాణ్యత, రాజకీయ స్వేచ్ఛ, సాంఘిక వ్యవస్థ, సాంకేతిక నిర్మాణం, సార్వత్రిక, ఉన్నత విద్య, పరిశోధన అభివృద్ధిపై ప్రభుత్వ వ్యయాలు, అవినీతి రహిత పాలన మొదలైన అంశాలు కీలకమైనవి.

**ఆర్థికవృద్ధి:** ఇది నిర్దిష్ట సమయంలో ఒక దేశ వాస్తవ తలసరి వస్తు సేవల ఉత్పత్తిలో పెరుగుదలను తెలుపుతుంది.

**ఆర్థికాభివృద్ధి:** ఇది ఒక దేశ సామాజిక, ఆర్థిక స్వరూపంలో ప్రగతిశీల మార్పులను తెలుపుతుంది. అంతేకాకుండా నిరుద్యోగం, పేదరికం, ఆదాయ అసమానతలు లాంటి అంశాల్లో భారీ తగ్గుదలకు దోహదం చేస్తుంది.

**ఆర్థిక అల్పాభివృద్ధి:** అల్పాభివృద్ధి చెందిన దేశ ప్రధాన లక్షణం 'తక్కువ తలసరి ఆదాయం ఉండటం.'

✪ భారత ప్రణాళిక సంఘం నిర్వచనం ప్రకారం అల్పాభివృద్ధి చెందిన దేశం అంటే – 'వినియోగించని, మానవ వనరులు, వెలికి తీయని సహజ వనరులు కలిసి ఉన్నది'.

**సుస్థిర అభివృద్ధి:** బ్రట్‌లాండ్ కమిషన్ (1987) అభిప్రాయం ప్రకారం 'భవిష్యత్ తరాల సంక్షేమానికి ఇబ్బందిలేకుండా ప్రస్తుత తరం అవసరాలు తీర్చుకోవడమే సుస్థిరాభివృద్ధి'.

### ఆర్థికాంశాల పాత్ర

ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో ఆర్థిక అంశాల పాత్ర అత్యంత కీలకమైంది. మూలధన నిల్వ, సంచయన రేటు ఒక దేశ ఆర్థికాభివృద్ధి నిర్దిష్ట సమయంలో జరుగుతుందో లేదో వెల్లడిస్తాయి. ఆర్థిక అభివృద్ధిని కింది అంశాలు నిర్ణయిస్తాయి.

**మూలధన సంచయనం:** ఒక దేశ ప్రగతిశీల నిర్మాణంలో మూలధనం క్రియాశీల పాత్ర పోషిస్తుంది. వృద్ధిరేటు పెరగాలంటే పెట్టుబడి ప్రధానమైంది. ఇది అభివృద్ధి దిశను నిర్ణయిస్తుంది. ఆదాయంలో ఎక్కువ శాతం పొదుపు చేస్తే పెట్టుబడులు పెరిగి అభివృద్ధికి దోహదం చేస్తుంది.

**వ్యవసాయ ఉత్పత్తుల మిగులు:** దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతలో పెరుగుదల ఉండటం అవసరం. ముఖ్యంగా గ్రామీణ ప్రజల అవసరాలు తీరిన తర్వాత మిగులు ఎంత ఉందో తెలిపేదే 'విక్రయం కాగల మిగులు'. ఈ మిగులు ఎక్కువగా ఉంటే ఆదాయాలు పెరిగి, ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.

**విదేశీ వ్యాపార స్థితి:** ఒక దేశం ఏ విధమైన వస్తువులను ఉత్పత్తి చేస్తుందనేది కూడా ఆర్థికాభివృద్ధిని నిర్ణయించే కీలక అంశం. అదే అంతర్జాతీయ వ్యాపారంలో మిగులును కూడా నిర్ణయిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రాథమిక రంగానికి సంబంధించిన ఉత్పత్తులను ఎగుమతి చేసి, పారిశ్రామిక, యంత్ర వస్తువులను దిగుమతి చేసుకుంటాయి. ఎక్కువ విలువైన వస్తువులను దిగుమతి చేసుకోవడం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విదేశీ నిల్వలు తగ్గిపోవడానికి కారణమవుతోంది.

**ఆర్థిక వ్యవస్థ తీరు:** ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో మార్పులు ఆ దేశం అనుసరిస్తున్న నమూనాపై ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా పెట్టుబడిదారులకు ప్రాధాన్యం లభిస్తోందా లేదా ప్రభుత్వ రంగం ద్వారా జరిగే అభివృద్ధికి ప్రాధాన్యం దక్కుతుందా అనేది కీలకమైన అంశం. అభివృద్ధి చెందుతున్న అన్ని దేశాలు ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల కలయిక ద్వారా ఏర్పడే మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యం ఇస్తున్నాయి.



R-14-5-15

## ఆర్థికాభివృద్ధి – కారకాలు

1) సహజ వనరులు

2) ఆర్థిక కారకాలు: మూలధన సంచయనం

★ వ్యవసాయ మిగులు

★ విదేశీ వాణిజ్య స్థితి

★ ఆర్థిక వ్యవస్థ రకం

3) ఆర్థికేతర కారకాలు: మానవ వనరులు

★ సాధారణ విద్య

★ సాంకేతిక విజ్ఞాన స్థితి

★ రాజకీయ స్వేచ్ఛ

★ సాంఘిక వ్యవస్థ నిర్మాణం

★ అవినీతి

★ అభివృద్ధి చెందాలనే కోరిక

★ పరిశోధన - అభివృద్ధిపై వ్యయం

## ఆర్థికేతర అంశాల పాత్ర

ఆర్థికాభివృద్ధిలో ఆర్థిక అంశాలకున్నంత ప్రాధాన్యం ఆర్థికేతర అంశాలకూ ఉన్నట్లు చారిత్రక అంశాలు తెలుపుతున్నాయి.

**ఆర్థికేతర అంశాల్లో ముఖ్యమైనవి....**

**మానవ వనరులు:** ఆర్థికాభివృద్ధిలో మానవ వనరులు కీలకమైన కారకం. దేశంలో అక్షరాస్యత, ఆరోగ్యవంతమైన, నైపుణ్యం కలిగిన జనాభాను మానవ వనరులుగా భావిస్తారు. వీరు ఉత్పత్తి పెరుగుదలకు అధిక స్థాయిలో దోహదం చేసి ఆర్థికాభివృద్ధికి, ఉత్పాదక స్థితి పెరుగుదలకు దోహదం చేస్తారు.

**సాంకేతిక విజ్ఞాన స్థితి:** ఒక దేశం ఉత్పత్తిలో పెరుగుదల, నాణ్యత, పరిమాణం మొదలైన అంశాలు సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి ఉంటాయి. సాంకేతిక పరిజ్ఞానం తక్కువ సమయంలో ఎక్కువ నాణ్యత ఉన్న వస్తువులను, అధిక పరిమాణంలో ఉత్పత్తి చేయడానికి సహకరిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాంకేతిక పరిజ్ఞానం అనేది ప్రభుత్వాలు పరిశోధన అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక రంగాలపై చేస్తున్న వ్యయంపై ఆధారపడి ఉంటుంది.

**రాజకీయ స్వేచ్ఛ:** ఒక దేశ ఆర్థిక స్థితి, వ్యవసాయ పారిశ్రామిక రంగాల అభివృద్ధి గతంలో ఆ దేశం వలస పాలనలో ఉందా లేదా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. పాలనాస్వేచ్ఛ లేకపోతే ఆర్థికాభివృద్ధి ఎక్కువగా ఉండదు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, కెన్యా, మలేషియా మొదలైనవి గతంలో బ్రిటిష్ పాలనలో ఉండటం వల్ల దోపిడీకి గురై, అభివృద్ధిలో వెనకబడ్డాయి. పాలనాస్వేచ్ఛ ద్వారా తమ వనరులు, ఉత్పత్తుల అభిలషణీయ వినియోగానికి అవకాశం ఏర్పడి తద్వారా స్వయం సమృద్ధిని సాధించవచ్చు.

**సాంఘిక వ్యవస్థ నిర్మాణం:** దేశ సాంఘిక వ్యవస్థలో ప్రధాన అంశాలైన కులం, మతం, ప్రాంతం, మూఢనమ్మకాలు, గ్రామీణ, పట్టణ సమాజం, స్త్రీ సాధికారత, అక్షరాస్యత, మహిళా అక్షరాస్యత మొదలైన అంశాల ఆధారంగా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. కాబట్టి ఒక దేశ సామాజిక నిర్మాణంలో ప్రజాభాగస్వామ్యం అధికంగా ఉండటం, అభివృద్ధి చెందాలనే భావన మొదలైనవి దాని ఆర్థికాభివృద్ధిని నిర్ణయిస్తాయి.

**అవినీతి:** అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికాభివృద్ధిని నిరోధించే ప్రధాన అంశం అవినీతి. ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి లాంటివి ప్రభుత్వ విధానాలు కొన్ని వర్గాలకు అనుకూల నిర్ణయాలు తీసుకునేలా పురికొల్పుతాయి. ఇది ఆర్థిక శక్తి కేంద్రీకరణకు, ఆదాయ అసమానతల పెరుగుదలకు దారితీస్తుంది.

**అభివృద్ధి చెందాలనే కోరిక:** ఆర్థికాభివృద్ధి అనేది ఒక యాంత్రికమైన ప్రక్రియ కాదు. ఇది ప్రజల ఆలోచన, మానసిక అనుకూల అంశాలపై ఆధారపడుతుంది. ప్రజల్లో తాము అభివృద్ధి చెందాలనే భావన, కోరిక ఎక్కువగా ఉంటే ఆ దేశం త్వరగా అభివృద్ధి చెందుతుంది. రిచర్డ్ టి.గిల్ అభిప్రాయం ప్రకారం – 'ఆర్థికాభివృద్ధి యాంత్రిక అంశాలపై ఆధారపడదు. దీన్ని మానవ వనరుల నైపుణ్యం, సమర్థత, పరిమాణం, నాణ్యత, వైఖరి మొదలైన అంశాల ఆధారంగా నిర్ణయిస్తారు.'

**పరిశోధన, అభివృద్ధిపై వ్యయం:** ప్రభుత్వం తన మొత్తం వ్యయంలో పరిశోధన రంగానికి ఎన్ని నిధులను కేటాయిస్తుందనే అంశంపై దేశ ఆర్థికాభివృద్ధి, ఉత్పత్తి పెరుగుదల ఆధారపడి ఉంటాయి. ఈ వ్యయం పెరిగితే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది ఉత్పత్తిలో భారీ పెరుగుదల సాధ్యమవుతుంది. అభివృద్ధి చెందిన దేశాలు జీడీపీలో సుమారు 5%, వెనుకబడిన దేశాలు 1% లోపు పరిశోధన రంగంపై వ్యయం చేస్తున్నాయి.

**ఆర్థికాభివృద్ధికి ఉన్న ప్రధాన లక్షణాలు:**

★ ఆర్థికాభివృద్ధి ఒక చలన ప్రక్రియ.

★ ఇది నిరంతరం మారే అంశం.

★ ఆర్థికవృద్ధి వ్యవస్థాపూర్వక, సాంకేతిక, గుణాత్మక, ప్రగతిశీల మార్పులను తెలుపుతుంది.

★ అభివృద్ధి చెందుతున్న దేశాలకు వర్తిస్తుంది.

★ దీన్ని వాస్తవిక తలసరి ఆదాయంతో కొలుస్తారు.

★ సంపద, సమాన పంపిణీని తెలుపుతుంది.

★ జీవన ప్రమాణ స్థాయిని పెంచుతుంది.

**ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ఇతర లక్షణాలు / అంశాలు:**

★ ఆర్థికాభివృద్ధి అనేక అంశాల సమ్మిళితం. ఇది బహుముఖమైంది.

★ ఇది విస్తృతమైన భావన.

★ దీన్ని సంఖ్యాపరంగా లెక్కించడం సాధ్యపడదు.

★ ఆర్థిక వ్యవస్థ గుణాత్మక, సంస్థాగత, వ్యవస్థపరమైన మార్పులను తెలుపుతుంది.

★ ఇది సంస్థాగత మార్పులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది.

★ ఆదాయ, సంపద పంపిణీని వివరిస్తుంది.

## ఆర్థికాభివృద్ధి – ప్రజాసంక్షేమం

ఆర్థికాభివృద్ధి ప్రధానంగా దేశంలో ఆర్థికవృద్ధి (ఉత్పత్తి పెరుగుదల)తోపాటు దేశంలో వచ్చే వ్యవస్థా పూర్వక, సాంఘిక, ప్రగతిశీల, సాంకేతిక మార్పుల గురించి తెలుపుతుంది. అంటే దేశంలో సమూల మార్పులను ఇది వివరిస్తుంది.

ప్రజాసంక్షేమాన్ని పెంచే చర్యలు:

★ సుస్థిరాభివృద్ధి

★ అసమానతల తగ్గింపు చర్యలు.

★ దేశీయ ఎగుమతుల వస్తు రకాలు

★ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి

★ వికేంద్రీకృత ప్రణాళికల అమలు

★ పారదర్శక పాలన, జవాబుదారీతనం

★ పాలనలో ప్రజాభాగస్వామ్యం

★ పాలనలో సాంకేతిక వినియోగం స్థాయి

★ అక్షరాస్యత, వైద్య రంగాల పురోగతి

★ స్వయం సమృద్ధి, స్వావలంబనకు తీసుకునే చర్యలు.

**ప్రజాసంక్షేమానికి తోడ్పడని అంశాలు:**

★ జనాభా వృద్ధి రేటులో పెరుగుదల

★ జాతీయ, తలసరి ఆదాయ వృద్ధిరేటు తగ్గుదల

★ పేదరికం, నిరుద్యోగం పెరుగుదల

★ ప్రాంతీయ, ఆదాయ అసమానతల వృద్ధి.

★ మూలధన, సాంకేతిక, వినియోగ వస్తు దిగుమతుల పెరుగుదల

★ ప్రభుత్వ విధానాల అమల్లో వైఫల్యం

★ ఉపయోగించని మానవ, సహజ వనరులు

★ ఎగుమతుల వృద్ధిలో తగ్గుదల

★ అవినీతి, సాంఘిక, వ్యవస్థాపరమైన వెనుకబాటుతనం

★ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం.

## మాదిరి ప్రశ్నలు

**1.** ఆర్థికాభివృద్ధి దేన్ని తెలుపుతుంది?

1) ఉత్పత్తి పెరుగుదల 2) దేశ వ్యవస్థాపూర్వక మార్పులు

3) సాంకేతిక మార్పులు 4) పైవన్నీ

**2.** 'ఆర్థిక శ్రేయస్సులో పెరుగుదల ఆర్థికాభివృద్ధి' అని అన్నది ఎవరు?

1) కొలిన్ క్లార్క్ 2) మైఖేల్ పి.తొడారో 3) జి.మేయర్ 4) కిండల్ బర్జర్

**3.** ఆర్థికాభివృద్ధి లక్షణం ఏది?

1) దీర్ఘకాలానికి చెందింది 2) చలన ప్రక్రియ 3) వ్యవస్థాపూర్వక మార్పులు 4) అన్నీ

**4.** ఆర్థికాభివృద్ధిని నిర్ణయించే అంశం ఏది?

1) సాంకేతిక పరిజ్ఞానం 2) మూలధనం 3) విదేశీ వాణిజ్యం 4) అన్నీ

**5.** 'ఆర్థికాభివృద్ధి బహుముఖ ప్రక్రియ' అని పేర్కొన్నది ఎవరు?

1) మైఖేల్ పి.తొడారో 2) హరడ్ 3) జి.మేయర్ 4) డోమర్

**6.** ఆర్థికాభివృద్ధిని నిర్ణయించే ఆర్థిక కారకం కానిది ఏది?

1) విదేశీ వాణిజ్య స్థితి 2) మూలధన సంచయనం

3) వ్యవసాయ మిగులు 4) సాంఘిక వ్యవస్థ స్వరూపం

**7.** ఆర్థికాభివృద్ధిని నిర్ణయించే ఆర్థికేతర కారకం కానిది?

1) సాంకేతిక స్థితి 2) మానవ వనరులు

3) అవినీతి 4) అంతర్జాతీయ వ్యాపారం

**8.** ఆర్థిక వృద్ధి, ఆర్థికాభివృద్ధి పర్యాయ పదాలుగా తెలిపింది ......

1) హరడ్, డోమర్ 2) మార్షల్, రాబిన్‌సన్

3) లూయిస్ 4) హిక్స్

**9.** కిందివాటిలో 'సుస్థిరాభివృద్ధి'లో భాగమైన అంశం ఏది?

1) పర్యావరణం 2) సమాజం 3) ఆర్థిక వ్యవస్థ 4) పైవన్నీ

**10.** ఆర్థికాభివృద్ధి ద్వారా ప్రజాసంక్షేమాన్ని పెంచే చర్య కానిది ఏది?

1) సాంకేతిక వృద్ధి 2) స్వయం సమృద్ధి 3) స్వావలంబన 4) ప్రాంతీయ అసమానతలు

**జవాబులు**

1-4; 2-1; 3-4; 4-4; 5-1; 6-4; 7-4; 8-3; 9-4; 10-4.

**రచయిత: దాసరి రాజేందర్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net